ముమ్మరంగా వరినాట్లు

ఏర్పేడు: మండలంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ఆ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ విద్యుత్ మోటార్ల ద్వారా సాగునీటిని పొలాలకు అందించి ట్రాక్టర్ల ద్వారా దుక్కులు చేసుకుంటున్నారు. కొంతమంది రైతులు చదును చేసుకున్న పొలాల్లో వరినాట్లు వేస్తున్నారు. కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో శ్రీకాకుళం జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన వలస కూలీలతో వరినాట్లు వేసుకుంటున్నారు. గత రబీ సీజన్‌లో ఆర్ఎన్ఆర్ వరిధాన్యం బస్తా రూ.2 వేలు నుంచి రూ.2,200 పలకడంతో రైతులు వరిసాగుపై మక్కువ చూపిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆర్ఎన్ఆర్ వరి రకంతో పాటు 1010 వరి రకాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు తొలకరి జల్లులు పలకరించకపోవడంతో విద్యుత్ మోటార్లను నమ్ముకుని వరినాట్లు వేస్తున్నారు. ఈ సీజన్‌లో సాగుకు ఎకరాకు రూ.15 వేలు నుంచి రూ.17 వేలు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు.



కోబాక పొలాల్లో వరినాట్లు వేస్తున్న కూలీలు



అంజిమేడు పొలాల్లో వరినాట్లకు నల్లమానుతో చదును చేస్తున్న రైతు



వరి నాటేందుకు దుక్కి చేస్తున్న ట్రాక్టర్

క్లుప్తంగా

దివ్యాంగులకు సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరివీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను సంస్థ అధినేత మునీర్‌బాషా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ 149 నెలలుగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా తాము ప్రతి నెలా దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. పనిచేసుకోలేని దివ్యాంగులకు ఏదైనా వ్యాపారం పెట్టించి వారి కాళ్లపై వారు ఆధారపడే విధంగా కార్యాచరణ త్వరలోనే చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో హరినాథ్‌నాయుడు, బాబా ఫరీద్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వర స్వామికి వెండి శంఖం వితరణ



శంఖం అందజేస్తున్న తిరుపతివాసులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో వెలసిన సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం తిరుపతికి చెందిన మంజుల, విష్ణువర్మ దంపతులు రూ.80 వేల విలువైన 810 గ్రాముల వెండి శంఖును వితరణ చేశారు. నిత్య అన్నదానానికి రూ.15 వేలు అందజేశారు. పరమశివుడికి, ప్రదోష నందీశ్వర స్వామికి నిర్వహించే ప్రదోష పూజలు, అభిషేకానికి వెండి శంఖును మొక్కుబడిగా అందించినట్టు తెలిపారు. వారికి ఆలయ చైర్మన్ స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏపీఎం మునిచంద్రశేఖర్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్రారెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు ఆనందయ్య, ప్రధాన అర్చకులు కార్తికేశన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, సిబ్బంది పరంధామరెడ్డి, శరవణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గాయత్రి జపం

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులో ఉన్న శివాలయంలో ఆదివారం లోకకల్యాణార్థం సామూహిక గాయత్రి జప పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ కల్వకొలను చిత్తరంజన్ దాస్ మెమోరియల్ ట్రస్ట్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో తిరుపతి కోఆర్డినేటర్ ఖండవల్లి రాధాకృష్ణ పర్యవేక్షణలో సుమారు 20 మంది జపతులు సామూహిక సంధ్యావందన సహిత గాయత్రి జపం చేశారు. అదేవిధంగా కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి 60వ జన్మదినం సందర్భంగా కపిలతీర్థం సమీపంలోనున్న వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులే



పోలీసు కవాతు నిర్వహిస్తున్న సీఐ మల్లికార్జున, కేంద్ర బలగాలు

రేణిగుంట: ఎన్నికల కౌంటింగ్ సమయాన ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున హెచ్చరించారు. మండలంలోని ఆర్.మల్లవరం పంచాయతీ సుబ్బయ్యగుంట, కుమ్మరపల్లి, ఆర్.మల్లవరం, కృష్ణాపురం గ్రామాల్లో ఆదివారం రేణిగుంట అర్బన్ పోలీసు అధికారులు కేంద్రబలగాలతో కలసి పోలీసు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వరకు 144 సెక్షన్ అమలులో ఉందని, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ముగియడానికి అందరూ సహకరించాలని ఆయన సీఐ కోరారు. అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కరకంబాడిలో కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ ఇందిరానగర్‌లోని రాస్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు చొరవతో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరం ప్రారంభోత్సవంలో రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ శరీరంలోని అన్ని భాగాల్లో కళ్లు ప్రధానమైన అవయవాలన్నారు. ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చి కళ్లను తరచూ పరీక్షించుకోవాలన్నారు. ఈ శిబిరంలో అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకాగా, వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. 50మందికి ఉచిత కంటి శస్త్రచికిత్స చేసేందుకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో అరవింద్ ఆస్పత్రి వైద్యనిపుణులు డాక్టర్ అనిత, ఆర్గనైజర్ వినోద్, రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, శైలజ, భారతి, లీలాప్రసాద్, మోహన్, వెంకటేష్, రాస్ ట్రస్ట్ సిబ్బంది గిరిప్రసాద్, అన్నలగన్, ఇందుమతి, జ్యోతి, నాగమణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీదేవి, ప్రత్యంగర శరభేశ్వరర్, వరాహి, ఇతర పరివార దేవతల విగ్రహాలకు తొలుత సుమంగళులచే కలిపిన పసుపు నీటిలో జలావాసం చేయించారు. ప్రత్యేక పూజలనంతరం విగ్రహాలను బయటకు తీసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం చుట్టూ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు హోరెత్తాయి. శివగామి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి



చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నాట్యం ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, నాట్య గురువు జ్యోతి శేఖర్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా గణేష పంచరత్న, నారాయణతే, వినరో భాగ్యం, చక్కని తల్లికి, దశావతో శబ్దం, మండూక శబ్దం, జయ జయ దుర్గే, కృష్ణ రాసలీల వంటి పాటలకు కళాకారులు వైష్ణవి, లాస్య, మీనాక్షి, అక్షర, సహస్ర, ఈష, సాక్షర శ్రీ, సాయి శ్రీప్రియ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగిన అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్ వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై ఆసక్తి



కన్నావరం పొలాల్లో గొర్రెల మంద

సత్యవేడు: పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడి సాధించేందుకు రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. రసాయనిక ఎరువుల వినియోగం వల్ల అనేక దుష్పరిణామాలు కలుగుతాయి. అంతేగాక ధరలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. సాగు ఖర్చులు కూడా పెరిగాయి. మెట్ట ప్రాంత రైతులు ఎకరా వరి పంటకు డీఏపీ, యూరియా, పొటాష్, జింకు వంటి ఎరువులను ఎక్కువగా వినియోగిస్తారు. ఎరువుల ధర ఎక్కువగా ఉన్నాయి. దీనికితోడు నకిలీ మందులు కూడా వస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. సాగు ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు దిగుబడి పెంచుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సేంద్రియ వ్యవసాయం ద్వారా కలిగే లాభాల గురించి అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువుల వినియోగించుకోవడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. పేడ ఎరువుతో పాటు మేకలు, గొర్రెల ఎరువును ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇందుకోసం బీడు భూముల్లో గొర్రెల మంద పెట్టిస్తున్నారు. ఒకరోజు మంద పెట్టడానికి రూ.700 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారు. పలువురు రైతులు చెరువుల్లో ఒండుమట్టిని పొలాలకు తోలుకుంటున్నారు. రైతులు పంటల సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందాలని సచివాలయాల్లోని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సగం ఖర్చు తగ్గుతుంది

పొలంలో మేకలు, గొర్రెల మంద పెట్టడంతో మంచి ఎరువు అందుతోంది. రసాయనిక ఎరువులు ఎక్కువగా వేసినా పంట దిగుబడి అంతంత మాత్రమే. దీంతో సేంద్రియ ఎరువులు వాడాలని నిర్ణయించుకున్నాం. ఒక సారి గొర్రెల మంద పెడితే రెండేళ్ల వరకు భూమిలో సత్తువ ఉంటుంది. ఎరువల ధర ఎక్కువగా ఉండడంతో తక్కువ ఖర్చుతో మంద పెట్టి మంచి ఎరువు వేస్తున్నాం.

– బాలాజీ, కన్నావరం

అన్ని విధాల శ్రేయస్కరం

సేంద్రియ ఎరువుల వాడకం అన్ని విధాల శ్రేయస్కరం. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. రసాయనిక ఎరువులతో భూసారం తగ్గుతుంది. దీంతో భూమి బీడుగా మారే అవకాశం ఉంది. సాగుకు అయ్యే పెట్టుబడి కూడా ఎక్కువే. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమి సారవంతం అవుతుంది. ఈ విషయాలపై రైతులకు పొలంబడి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– మురళి, సత్యవేడు మండల వ్యవసాయాధికారి

రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలన ఖాయం



సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరిదేవి అమ్మవారి సన్నిధిలో నూకతోటి రాజేష్ దంపతులు

- చెంగాళమ్మ పరమేశ్వరి సేవలో నూకతోటి రాజేష్ దంపతులు

వరదయ్యపాళెం: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆదివారం వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, ఆయన సతీమణి చైతన్య భాను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలన రావాలని కోరుతూ అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు అంతా మంచి జరగాలని వేడుకున్నట్లు వివరించారు. అదేవిధంగా వరదయ్యపాళెం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి శివాయాదవ్, కుటుంబ సభ్యులు నిర్వహించిన పూజలో నూకతోటి దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు సూళ్లూరుపేటలోని చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి నివాసం వద్ద కార్యకర్తలు రాజేష్ దంపతులను సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, భానుప్రకాష్ రెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సురుటుపల్లి ఆలయ మాజీ చైర్మన్ ఏపీఎం మునిశేఖర్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, దేవాంగ సంఘం మాజీ అధ్యక్షుడు పృథ్వీరవి, మార్కెటింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ పాల సుబ్రమణ్యం రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ప్రభాకర్, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సాయిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, మహేంద్ర, బాబు నాయుడు, సుబ్రమణ్యం, గజా, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూకతోటి రాజేష్ దంపతులను సత్కరిస్తున్న వరదయ్యపాళెం మండల వైఎస్సార్‌సీపీ నేతలు

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు

సత్యవేడు: ఇటీవల విడుదలైన ఫలితాల్లో 10వ తరగతి, సీనియర్ ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థులకు దేవాంగ సంఘం తరఫున మన్నెం శివయ్యశెట్టి రూ.10 వేల బహుమతి అందజేశారు. దేవాంగ సంఘం సమావేశం ఆదివారం రాత్రి మన్నెం శివయ్య శెట్టి ఇంటి ప్రాంగణంలో నిర్వహించారు. దేవాంగ కులానికి చెందిన విద్యార్థులు సజ్జా మానస కార్తీక్ పదవ తరగతిలో 592 మార్కులు, ఇంటర్‌లో 977 మార్కులు సాధించిన ఎల్.యశ్వంతజీకి రూ.5 వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంఘం అధ్యక్షుడు జే. పాండురంగయ్య, ప్రధాన కార్యదర్శి వై.మురళీకృష్ణ, కోశాధికారి పి.రవిబాబు, మన్నెం గిరికుమార్, వీజీ.బాలగురప్ప, కే.హేమభూషణం తదితరులు పాల్గొన్నారు.



దేవాంగ కుల విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న మన్నెం శివయ్య శెట్టి

మెరుగ్గా ఆరోగ్యశ్రీ అమలు

తిరుపతి తుడా : ఆరోగ్యశ్రీ వైద్య సేవలను మరింత మెరుగ్గా అమలు చేస్తున్నామని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం ఆయన తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు, ఎమర్జెన్సీ ఐసీయూ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శించారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రేడియేషన్ థెరపీ, ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించి పనితీరు తెలుసుకున్నారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్‌తో ఆయన కలిసి స్విమ్స్‌తో పాటు రుయాలోని పలు వార్డులను తనిఖీ చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ టీం లీడర్స్ పురం శ్రీనివాసులు, సమాధి శ్రీనివాసులు, ఆరోగ్య మిత్రా పాల్గొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రామ్, డాక్టర్ జయచంద్ర రెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. ఆరోగ్యం భద్రం

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలాయి. వీధులు, కాలువల్లో నీరునిలవడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఫీవర్ సర్వే చేస్తున్నారు.

- వాతావరణ మార్పులతో ప్రబలుతున్న విషజ్వరాలు
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల దూరం
- ముమ్మరంగా ఫీవర్ సర్వే



వరదయ్యపాళెం మండలంలో పిల్లలకు మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: ఆడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల తాగునీరు కలుషితమవుతోంది. మరికొన్నిచోట్ల వర్షపు నీరు వీధుల్లో నిలిచి దోమలు పెరిగి జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యాధుల కట్టడికి వైద్య సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి విషజ్వరాల పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే రక్త కణాల పరీక్షలు జరిపి పరిస్థితి తీవ్రం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువ ఉన్న రోగులకు రక్తం, ప్లేట్‌లెట్స్ కోసం రెఫర్ చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా టైఫాయిడ్ వ్యాపిస్తుందని, 103 నుంచి 104 డిగ్రీల వరకు జ్వరం ఉంటుందని వెల్లడిస్తున్నారు. వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, తల, కడుపునొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం తదితర లక్షణాలు ఉంటాయని చెబుతున్నారు. అదేవిధంగా దోమకాటుతో డెంగీ జ్వరం వస్తుందని, ఈ దోమలు పగటిపూట మాత్రమే కుడతాయని వెల్లడిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒంటి నొప్పులతో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, ఆకలి మందగించడం, ఛాతీపై ఎర్రటి మచ్చలు రావడం లాంటి లక్షణాలు ఉంటాయని, ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిపోవడం, లోబీపీ, చర్మంపై దద్దుర్లు, పొట్టలో వికారంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇలా జ్వరాలు వచ్చిన వెంటనే ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని చెబుతున్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. జ్వరాలు వచ్చిన వారితో పాటు అనుమానితుల రక్త నమూనాలను సేకరించి అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు.



వరదయ్యపాళెం మండలంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. రెండు రోజులకు పైగా జ్వరం తగ్గకుంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి. సాధ్యమైనంత వరకు నీటిని కాచి తాగాలి. అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ ఉదయ్ కుమార్, వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ

సుమధురం.. అన్నమయ్య సంకీర్తనల గానం





గానం చేస్తున్న అన్నమయ్య వంశానికి చెందిన లలిత, హయగ్రీవ నారాయణాచార్యులు, యువ సంగీతకారులు శ్రీనివాస శర్మ బృందం

తిరుపతి కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస శర్మ బృందం, లలిత, హయగ్రీవ నారాయణచార్యుల బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల గానామృతం సుమధురంగా సాగింది. అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తి సంకీర్తనల గాత్ర కచేరీ నిర్వహించారు. అన్నమాచార్యుల వంశానికి చెందిన 13వ తరం వారసులు ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ లలిత, హయగ్రీవ ఆలపించిన కీర్తనలతో భక్తజనం తన్మయత్వం చెందారు. ఇందులో భాగంగా వారు ఇందరికీ అభయంబు.., శోభనమే శోభనమే.., పిలువరే కృష్ణుని.., వేదం బెవ్వని వేడుకుందామా.. వంటి కీర్తనలను రమణీయంగా గానం చేసి సభికులను మైమరిపించారు. అనంతరం ప్రముఖ యువ సంగీతకారులు శ్రీనివాస శర్మ బృందం పలు విచార మేల.., రాజీవ నేత్రాయ.., ఎంత మాత్రమున.., తానే స్వయంగా స్వరపరిచిన ఆలపించిన కొనుట వెగ్గణము వంటి అన్నమయ్య సంకీర్తనలు గానం చేసి సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. కళాకారులను అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల స్వామి ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించి అభినందించారు.